సాక్షి
వికారాబాద్

శనివారం । 19 । ఏప్రిల్ । 2025



అకాల వర్షం.. అన్నదాతకు..

అకాల వర్షాలు రైతన్నలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పలుచోట్ల చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. 10లో▸



పంట మార్పిడితో మేలు

పంట మార్పిడి విధానంతో అధిక లాభాలు పొందవచ్చని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు అన్నారు. 10లో▸



వైభవంగా ఉత్సవాలు

తాండూరు పట్టణంలోని భావిగి భద్రేశ్వర స్వామి జాతరలో భాగంగా స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. 11లో▸

న్యూస్‌రీల్

జాతరకు భారీ బందోబస్తు

పట్టణ సీఐ సంతోష్



తాండూరు: తాండూరులో కొలువుదీరిన భావిగి భద్రేశ్వర స్వామి జాతరకు 250 మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పట్టణ సీఐ సంతోష్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించే రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పల్లకీ సేవ, రథోత్సవాన్ని సీసీ కెమెరాతో పర్యవేక్షించనున్నట్లు వివరించారు. ప్రతి వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. రథోత్సవానికి వేల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్లు భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఇద్దరు డీఎస్పీలు, 7గురు సీఐలు, 20 మంది ఎస్‌ఐలు, 11 మంది ఏఎస్‌ఐలు, 31 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 41 మంది హోంగార్డులతో భద్రతను పర్యవేక్షిస్తామన్నారు. చోరీలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు మఫ్టీలో సంచరిస్తారని పేర్కొన్నారు. జాతర పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

తాండూరు: పట్టణంలోని వ్యాపార సముదాయాలు, విద్య, వైద్యశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వాటి యాజమాన్యాలకు పట్టణ సీఐ సంతోష్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. దొంగతనాలు, ఇతర నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పోలీసులు తెలిపారు. పట్టణంలోని ఫంక్షన్ హాళ్లు, పెట్రోల్ బంకులు, కల్లు దుకాణాలు, మద్యం దుకాణాలు, ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలలు, ఆసుపత్రులు, వాణిజ్య సముదాయాల్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

9మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి

తాండూరు రూరల్: తాండూరు సబ్ డివిజన్ పరిధిలో పని చేస్తున్న తొమ్మిది మంది కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా ప్రమోషన్ లభించింది. శుక్రవారం ఈ మేరకు డీఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. 2006, 2007 బ్యాచ్‌కు చెందిన వారికి పదోన్నతి లభించింది. తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఒక్కరికి, యాలాల పీఎస్ నుంచి ముగ్గురికి, పెద్దేముల్ పీఎస్‌లో ముగ్గురికి, కరన్‌కోట్ పీఎస్‌లో ఇద్దరు కానిస్టేబుళ్లకు ప్రమోషన్ వచ్చింది. ఇప్పటికే వారు ఆరు వారాల పాటు శిక్షణ పూర్తి చేసుకున్నారు. ప్రమోషన్ పొందిన పోలీసులకు హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలోని స్టేషన్లలో పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 18 ఏళ్ల తర్వాత హెడ్‌కానిస్టేబుళ్లుగా ప్రమోషన్ రావడంతో పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

జూ పార్కులో రైనో ఫుడ్ కోర్టు ప్రారంభం

చార్మినార్: నగరంలోని జంతు ప్రదర్శనశాలకు వచ్చే సందర్శకులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగా అన్ని రకాల సేవలను అభివృద్ధి చేస్తున్నట్లు అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్) ఆర్.ఎం.డోబ్రియల్ అన్నారు. జూ పార్కులో ఆధునిక సౌకర్యాలతో కూడిన ఫుడ్ కోర్టును అటవీశాఖ అందుబాటులోకి తెచ్చింది.

‘హస్త’వ్యస్తం!

- చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్‌లో తారాస్థాయికి చేరిన అంతర్గత పోరు
- రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల నియోజకవర్గాల్లో రెండుగా చీలిపోయిన కేడర్
- పాత, కొత్త నేతల మధ్య కొరవడిన సమన్వయం
- తాజాగా గాంధీభవన్‌కు చేరిన పంచాయితీ
- పార్టీ పెద్దల వద్ద సమస్యల ఏకరువు



ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో సమావేశమైన నేతలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ‘హస్తం’ పార్టీలో నేతల మధ్య సమన్వయం కొరవడింది. పాత, కొత్త నేతల మధ్య పొసగడం లేదు. సంస్థాగతంగా పార్టీ కేడర్ రెండుగా చీలిపోయింది. కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడిన వారిని కాదని, ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన వారికి సంస్థాగతంగా పలు పదవులు కట్టబెడుతుండటాన్ని కేడర్ జీర్ణించుకోలేకపోతోంది. జిల్లాకు ఓ మంత్రి కూడా లేకపోవడంతో సంస్థాగతంగా తమకు ఎదురవుతున్న ఇబ్బందులను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని అయోమయ పరిస్థితి నెలకొంది. అటు కేడర్‌ను ఇటు లీడర్లను సమన్వయం చేయాల్సిన డీసీసీ అధిష్టానం కూడా ఈ విషయంలో అంటీముట్టనట్లు వ్యవహరిస్తోంది.

ఇతర పార్టీల నుంచి చేరికలు

అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా హస్తం హవా కొనసాగింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మాత్రం ఆశించిన సీట్లు గెలవలేకపోయింది. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి, షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. ఎల్బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకొచ్చే పేరుతో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కారు దిగి హస్తం గూటికి చేరుకున్నారు. రంగారెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్లు తీగల అనితారెడ్డి, పట్నం సునీతామహేందర్‌రెడ్డి దంపతులు సైతం హస్తం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి సైతం కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ గుర్తుపై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. సీఎం సొంత ఇలాఖాలో పార్టీ ఘోర ఓటమి పాలవడాన్ని ఏళ్ల తరబడి పార్టీనే నమ్ముకుని పని చేస్తున్న కేడర్ జీర్ణించుకోలేకపోయింది.

అధిష్టానం వద్దకు నేతలు

మరోవైపు ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన వారి పెత్తనం తమపై ఏమిటని పాతనేతలు గుర్రుగా ఉన్నారు. వీలుచిక్కినప్పుడల్లా అధిష్టానం దృష్టికి తీసుకెళ్తున్నారు. ఇటీవలె చేవెళ్లలో ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో విభేదాలు మరోసారి బయటపడ్డాయి. నియోజకవర్గానికి చెందిన ఓ వర్గం నేతలు సదరు కార్యక్రమానికి హాజరు కాకుండా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి తమకు కనీస సమాచారం లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తాజాగా శుక్రవారం రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల శాసనసభా నియోజకవర్గాల లీడర్లు గాంధీభవన్‌లో ఆ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ముందు ఏకరువు పెట్టారు. దీంతో ఏకంగా మీనాక్షి నటరాజన్ రంగంలోకి దిగి దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టడం కొసమెరుపు.

మహనీయుల స్ఫూర్తితో సాగుదాం

మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి



మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

అనంతగిరి: మహనీయుల ఆశయాలను సాధిద్దామని.. వారి స్ఫూర్తితో ముందుకు సాగుదామని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ అధ్యక్షతన మేధావుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుదామన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శమన్నారు. కేంద్రం ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, మేధావులు పాల్గొన్నారు.

అంబలితో ఆరోగ్యం

- జొన్న రొట్టెలకు పెరిగిన డిమాండ్
- రెండింటిలోనూ మెండుగా పోషకాలు
- ఇష్టంగా తింటున్న జనాలు



రాగి అంబలి

కొడంగల్: పేదలు ఎంతో ఇష్టంగా తాగే పానీయం అంబలి. ఉదయం పూట అంబలి తాగితే ఆరోగ్యం మెరుగు పడుతుందని ప్రజల నమ్మకం. ఆ నమ్మకం ఇప్పుడు పట్టణాలకు కూడా వ్యాపించింది. ప్రస్తుతం పట్టణాల్లో అంబలి కేంద్రాలు ఎక్కువగా వెలుస్తున్నాయి. వేసవి కాలం కావడం వల్ల అంబలికి ప్రాధాన్యం సంతరించుకుంది. పేదలు ఎంతో ఇష్టంగా తాగే ఆహార పదార్థాల్లో అంబలి ఒకటి. సమాజంలో నూటికి 70శాతం మంది పలు రకాల రుగ్మతలతో బాధ పడుతున్నారు. రకరకాల రోగాలు ప్రజలను బాధిస్తున్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలు వారి ఆహార అలవాట్లను మార్చుకుంటున్నారు. ఉదయం పూట అంబలి తాగుతున్నారు. మధ్యాహ్నం జొన్న రొట్టెతో భోజనం చేస్తున్నారు. రాత్రి వేళల్లో తేలిక పాటి ఆహారం తీసుకుంటున్నారు. తెలంగాణలో చాలా మంది ఇళ్లల్లో ప్రధాన ఆహారంగా అంబలి తయారు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. అంబలి రెండు రకాలు.. ఒకటి జొన్న అంబలి, రెండోది రాగి అంబలి. ఈ రెండు కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. జొన్న, రాగుల్లో బీ కాంప్లెక్స్, విటమిన్స్, ఫైబర్, విటమిన్ ఏ, విటమిన్ సీ, అమినో యాసిడ్స్ లాంటి అత్యవసర పోషకాలు అధికంగా ఉన్నాయి. చక్కెర వ్యాధిగ్రస్తులకు ఇది చక్కటి ఆహారం. ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుకోవడంలో అంబలి ఎంతో ఉపయోగపడుతుంది. శరీర నిర్మాణానికి తోడ్పడే మాంస కృత్తులు, శక్తి నిచ్చే పదార్థాలతో పాటు రక్త వృద్ధికి తోడ్పడే ఐరన్, కాల్షియం, బీ విటమిన్లు, ఫోలిక్ ఆమ్లం వంటి సూక్ష్మ పోషకాలు జొన్నలు, రాగుల్లో పుష్కలంగా లభిస్తాయి.

జొన్న రొట్టెలతో రోగాలు దూరం

జొన్న రొట్టెలను ఒకప్పుడు పేదలు ఎంతో ఇష్టంగా తినేవారు. ప్రభుత్వాలు ఉచితంగా బియ్యం పంపిణీ చేయడం ప్రారంభించిన తర్వాత రొట్టెల వినియోగం తగ్గింది. రొట్టెలను తినడం మానేసిన తర్వాత రోగాలు పెరిగాయి. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రకరకాల రోగాలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ జొన్న రొట్టెలను తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ మధ్యకాలంలో జొన్న రొట్టెలు ప్రధాన ఆహారంగా మారింది. రోడ్డు పక్కన కట్టెల పొయ్యిపై తయారు చేసే రొట్టెలకు ఎంతో డిమాండ్ ఉంది. చాలా మంది ఇష్టంగా తింటున్నారు. ఎక్కువ మంది జనాలు ఉదయం పూట అల్పాహారంగా రొట్టెలను తింటున్నారు.



జొన్న రొట్టెలు చేస్తున్న మహిళలు



వికారాబాద్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఆ చట్టాలను రద్దు చేయాల్సిందే

- ముస్లిం సంఘాల డిమాండ్
- వికారాబాద్‌లో నిరసన ర్యాలీ

అనంతగిరి: వక్ఫ్ సవరణ చట్టాలను వెంటనే రద్దు చేయాలని వికారాబాద్ ముస్లిం సంఘాల నాయకులు, మత పెద్దలు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లి ఈద్గా నుంచి ఎన్‌టీఆర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ముస్లింలకు కల్పించిన హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. వక్ఫ్ సవరణ చట్టం వల్ల ముస్లిం సమాజానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో అన్ని మసీదుల అధ్యక్షులు, జమాత్‌ల సదర్‌లు, వెల్ఫేర్ అధ్యక్షులు, ఆయా రాజకీయ పార్టీల మైనార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేటలో..

వక్ఫ్ సవరణ చట్టాలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు మోమిన్‌పేటలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ సాగింది. ముస్లిం మత పెద్దలు, ఆయా పార్టీల మైనార్టీ నాయకులు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్‌లో ఇంటి దొంగలు!

రూ.11.45 కోట్లకు టెక్నికల్ రైటాఫ్ అంటూ ప్రచారం



- అనుమతి లేదన్న డీసీఓ
- సొమ్ము వసూళ్లలో నిర్లక్ష్యం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఇంటి దొంగల వ్యవహారంతో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లు నిత్యం వార్తల్లో నిలుస్తున్నాయి. తాజాగా రైతుల ముసుగులో కొంత మంది డీసీఎంఎస్ ఉద్యోగులు, పాలకవర్గం సభ్యులు బినామీ పేర్లతో జేబులు నింపుకొంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సొసైటీకి చెల్లించాల్సిన కోట్లాది రూపాయలు దారి మళ్లిస్తున్నారని విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఏకంగా జిల్లా సొసైటీ అధికారికి తెలియకుండానే మొండి బకాయిలకు టెక్నికల్ రైటాఫ్ పెట్టడం.. పాలకవర్గం దాన్ని ఆమోదించడం చర్చనీయాంశంగా మారింది.

రూ.కోట్లలో బకాయిలు

దశాబ్దాల కాలంగా డీసీఎంఎస్‌ల నుంచి రైతులకు విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తున్నారు. వరి, కందులు తదితర పంటలను కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే విత్తనాలు, ఎరువులు అరువుగా తీసుకెళ్లిన రైతులు తిరిగి చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇలాంటి వారిని గుర్తించి నోటీసులు జారీ చేయడం, బకాయిలను వసూలు చేయాల్సిన అధికారులు మిన్నకుండిపోతున్నారు. దీంతో బకాయిలు పెరిగి రూ.కోట్లకు చేరాయి. కొన్ని డీసీఎంఎస్ కేంద్రాలు ఏటా నష్టాలను మూటగట్టుకుంటున్నాయి. వికారాబాద్, తాండూరు, పరిగి, చేవెళ్ల తదితర డీసీఎంఎస్‌ల్లో సిబ్బంది, పాలకవర్గం సభ్యులు రైతుల ముసుగులో రూ.కోట్లలో దారి మళ్లిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో కందుల సొమ్ము స్వాహా చేశారన్న ఆరోపణల రావడంతో విచారణ చేపట్టి, కొంత మందిపై కేసులు సైతం నమోదు చేశారు. ఆయా మొత్తాన్ని సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేశారు. ప్రస్తుతం రైతుల ముసుగులో ఉన్న బినామీల నుంచి పెద్ద మొత్తంలో మొండి బకాయిలను వసూలు చేయడంలో డీసీఎంఎస్ సిబ్బంది మీనమేషాలు లెక్కిస్తున్నారని తెలుస్తోంది. గతంలో కొడంగల్ కందుల కేసులో విచారణ ఎదుర్కొన్న వ్యక్తుల పాత్ర ఇందులో ఉందని సమాచారం. ఒక సీజన్‌లో ఎరువులు, విత్తనాలు తీసుకెళ్లిన వ్యక్తి డబ్బులు చెల్లించకపోతే రెండో సీజన్‌లో మళ్లీ అదే వ్యక్తికి అరువు ఎలా ఇచ్చారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఫలితంగా రూ.11 కోట్ల వరకు నష్టపోయే ప్రమాదం ఉందని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. డీసీఎంఎస్‌కు చెందిన ఓ అధికారి మాట్లాడుతూ.. మార్క్‌ఫెడ్‌కు కందులు అమ్మినప్పుడు తరుగు కింద పట్టుకున్న సొమ్ము సుమారు రూ.35 లక్షల వరకు ఉంటుందని, దాన్ని ఇన్‌చార్జిల నుంచి వసూలు చేయాల్సి ఉండగా టెక్నికల్ రైటాఫ్ పెట్టామని, పాలకవర్గం దీన్ని ఆమోదించిందని తెలిపారు. ఇదిలా ఉంటే సిబ్బంది నియామకంలోనూ అర్హులైన వారు ఉండగా, తమకు అనుకూలమైన వారైన జూనియర్లను కీలక పదవుల్లో కూర్చోబెట్టడం విమర్శలకు తావిస్తోంది.

విచారణ చేపడతాం

మొండి బకాయిల విషయంలో టెక్నికల్ రైటాఫ్ పెట్టాలంటే మేము అనుమతి ఇవ్వాలి. మా దగ్గర నుంచి అలాంటి అనుమతులు ఎవ్వరికీ ఇవ్వలేదు. వాళ్లకు వాళ్లు టెక్నికల్ రైటాఫ్ పెట్టుకుంటామంటే అది చెల్లదు. విచారణ చేపట్టి అలా చేస్తే సంబంధిత సభ్యుల నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేస్తాం.

– సుధాకర్, జిల్లా సహకార అధికారి, రంగారెడ్డి

ఇంటి వద్దే పనంటూ మోసం

- తోటి మహిళల నుంచి డబ్బు వసూలు
- పోలీసుల అదుపులో నిందితురాలు



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న కానిస్టేబుల్

మోమిన్‌పేట: ఇంటి వద్దే ఉపాధి కల్పిస్తానని మాయమాటలు చెప్పి తోటి మహిళల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసిన ఓ మహిళను శుక్రవారం మోమిన్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి కథనం మేరకు.. మండలంలోని ఎన్కెపల్లికి చెందిన సురేఖకు కోహిర్ మండలం బిల్లలుపూర్‌కు చెందిన నాగరాజుతో ఇల్లరికం వివాహం జరిగింది. సురేఖ భర్త రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. అప్పటి నుంచి సదరు మహిళ ఇంటి వద్ద ఉంటూ టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తోంది. ఇంటి వద్దే ఉంటూ నెలకు రూ.15 వేల నుంచి రూ. 20 వేల వరకు సంపాదించే అవకాశం ఉందనే సెల్‌ఫోన్‌లో వచ్చిన రీల్‌ను చూసి ఆ నంబర్‌కు ఫోన్ చేసింది. ఈ క్రమంలో మహేందర్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. మా కంపెనీ పేరు మహేందర్ అండ్ మహేందర్ అని.. చాక్లెట్స్ తయారు చేస్తామని సదరు వ్యక్తి సురేఖకు చెప్పాడు. ఆ చాక్లెట్లను మీ ఇంటి వద్దకు పంపుతామని వాటిని ప్యాకింగ్ చేసి తిరిగి పంపితే నెలకు రూ.15 నుంచి 20 వేల వరకు జీతం వస్తుందని చెప్పాడు. మరికొంత మంది మహిళలను ఇందుకోసం సిద్ధం చేస్తే కంపెనీ నుంచి మంచి జీతం వస్తుందని తెలిపాడు. డబ్బు వస్తుందనే ఆశతో సురేఖ మండలంలోని మోమిన్‌పేట, వెల్చాల్, చంద్రయాన్‌పల్లి, రాంనాథ్ గుడుపల్లి, కోట్పల్లి గ్రామాలతోపాటు నవాబుపేట మండలంలోని బార్వాద్, ఎల్లకొండ గ్రామాల్లోని మహిళలకు ఈ విషయం చెప్పి దాదాపు 300మంది నుంచి రూ.1,000 చొప్పున రూ.3లక్షల వరకు వసూలు చేసింది. కొద్ది రోజుల తర్వాత డబ్బు ఇచ్చిన మహిళలు సురేఖకు ఫోన్ చేసి పని ఎప్పటి నుంచి ప్రారంభమవుతుందని అడగటం మొదలు పెట్టారు. త్వరలో మీవద్దకు చాక్లెట్లు వస్తాయని చెప్పింది. ఆ తర్వాత సురేఖ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుంది. అనుమానం వచ్చిన మహిళలు శుక్రవారం ఎన్కెపల్లిలోని సురేఖ ఇంటికి వచ్చారు. పని, డబ్బు విషయంపై నిలదీశారు. ఈ విషయం పోలీసులకు చేరడంతో సురేఖను పీఎస్‌కు తీసుకువచ్చారు. మిగిలిన బాధితులు కూడా పీఎస్‌కు చేరుకుని జరిగిన విషయాన్ని పోలీసులకు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ దత్తాత్రేయ తెలిపారు.

హైదరాబాద్–శ్రీశైలం రహదారిని విస్తరించాలి

ఆమనగల్లు: హైదరాబాద్–శ్రీశైలం రహదారిని విస్తరించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ నేత ఆచారి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కండె హరిప్రసాద్‌తో వెళ్లి కేంద్రమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగిందని, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. వాహనాల రద్దీకి అనుగుణంగా ఉండేలా రహదారని నాలుగు లేన్లుగా విస్తరించాలని విజ్ఞప్తి చేశారు.

కురుమలు అన్ని రంగాల్లో ఎదగాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: కురుమలు ఐకమత్యంతో అన్ని రంగాల్లో ఎదగాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం ఆకాంక్షించారు. మున్సిపల్ పరిధిలోని దేవుని ఎర్రవల్లిలో కురమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న సంఘం నూతన భవనాన్ని శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. రాజీవ్ యువ వికాసం ద్వారా యువతకు అందించే రుణాలను కురుమలు కూడా ఉపయోగించుకోవాలని చెప్పారు. కుల వృత్తితోపాటు ఇతర ఉపాధి మార్గాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కురుమలు ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో రాణించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గె మల్లేశం, రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ అన్నారు. కురుమల ఐక్యతను చాటే విధంగా అన్ని గ్రామాల్లో సంఘాలను బలోపేతం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, కురుమ సంఘం నాయకుడు, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్పనాగేశ్, పలు పార్టీల నాయకులు, కురుమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం

బంట్వారం: కోట్‌పల్లి మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం శనివారం కరీంపూర్ సమీపంలోని మైటీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుందరి అనిల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇట్టి సమావేశానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ హాజరవుతారని తెలిపారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ సభకు సంబంధించి సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. అనంతరం కోట్‌పల్లి మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

వివాహ వేడుకలో స్పీకర్ ప్రసాద్‌కుమార్



నూతన వధూవరులతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

తాండూరు రూరల్: మండలంలోని కోత్లాపూర్ గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోపాల్ కూతురు మధులత వివాహం హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్‌తో శుక్రవారం నగరంలోని శిల్పారామంలో జరిగింది. ఈ వివాహానికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ సునీతారెడ్డి, ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేష్ మహారాజ్, తాండూరు ఎమ్మెల్యే మనోహ ర్‌రెడ్డి పాల్గొన్నారు.

మణికంఠనగర్ కాలనీ వాసుల గస్తీ



మణికంఠ కాలనిలో జాగరణ చేస్తున్న కాలనీవాసులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లి మణికంఠనగర్ కాలనీలో కొన్ని రోజులుగా కాలనీవాసులు రాత్రి పూట గస్తీ నిర్వహిస్తూ జాగరణ చేస్తున్నారు. కాగా ఈ మధ్య కాలంలో జరిగిన దొంగతనం నేపథ్యంలో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలో పోలీసులు వెంటనే తగిన చొరవ తీసుకుని విధిగా కాలనీలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ గస్తీ ముమ్మరం చేయాలని వారు కోరుతున్నారు.

ట్రాన్స్‌జెండర్లపై కేసు నమోదు

మీర్‌పేట: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ట్రాన్స్‌జెండర్స్‌పై మీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారులు, కూడళ్లలో కొందరు ట్రాన్స్‌జెండర్లు రాత్రివేళల్లో అసభ్యకర దుస్తులు ధరించి వికృత చేష్టలు చేయడంతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ అసౌకర్యం కలిగిస్తున్నారన్న సమాచారం రావడంతో మీర్‌పేట పోలీసులు గురువారం రాత్రి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మందమల్లమ్మ చౌరస్తా, ఆర్‌సీఐ రహదారిపై 7 మంది ట్రాన్స్‌జెండర్లను అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

9.5 కిలోల గంజాయి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్ పోలీసులు గుడి మల్కాపూర్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి 9.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడి మల్కాపూర్ రోడ్డు పిల్లర్ నెంబర్ 68 ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్మకాలు జరుపుతున్నట్లుగా సమాచారం అందడంతో దాడులు చేసి పట్టుకున్నారు. ఈ కేసులో పర్వేస్ సిద్దం, దివంత్ మహీధర్‌లను అరెస్ట్ చేయగా రితిక్ అనే వ్యక్తిపైన కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు.



దుద్యాల్: ఓ మామిడితోటలో రాలిన మామిడికాయలు



తాండూరు రూరల్: మారెపల్లి తండా వద్ద నెలకొరిగిన వరిపంట

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం

దెబ్బతిన్న మామిడి, బొప్పాయి, వరి పంటలు

- ప్రభుత్వమే ఆదుకోవాలంటున్న రైతులు

దుద్యాల్: అకాల వర్షాలు రైతన్నలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని హస్నాబాద్‌లో మామిడి పంటకు అపార నష్టం వాటిల్లింది. పలు గ్రామాల్లో బొప్పాయి చెట్లు నేలకొరిగాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట దెబ్బతినింది. 15 రోజుల క్రితం నుంచి అకాల వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలకు భారీ నష్టం కలుగుతుండటంతో కన్నీరు మున్నీరవుతున్నారు. అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి పరిహారం అందేలా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

అంధకారంలో గ్రామాలు..

తాండూరు రూరల్: మండలంలోని పలుగ్రామాలు ఇంకా అంధకారంలోనే ఉన్నాయి. గురువారం కురిసిన గాలివాన.. వడగండ్ల వర్షానికి విద్యుత్ స్తంభాలు, వైర్లు, చెట్లు నేలకొరిగిన విషయం తెలిసిందే. దీంతో పలు గ్రామాల్లో దాదాపు 30 గంటలుగా కరెంట్ సరఫరా నిలిచిపోయింది. తాండూరు పట్టణంలోని రాజీవ్ గృహకల్ప సమీపంలోని 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి పెద్దేముల్, బంట్వారం మండలాల్లోని ఐదు సబ్‌స్టేషన్లు (గాజీపూర్, ఇందూర్, తట్టేపల్లి, తొర్మామిడి, బంట్వారం)కు విద్యుత్ సరఫరా అవుతుంది. రాజీవ్‌గృహ సమీపంలోని బషీర్‌మియా తండాలో విద్యుత్ స్తంభాలపై చెట్లు పడటంతో ఆ ఐదు సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీంతో బాయిమీది తండా, రచ్చకట్ట తండా, అడికిచెర్ల మరి కొన్ని తండాల్లో అంధకారం నెలకొంది. విద్యుత్ సరఫరా లేకపోవడంతో తాగునీటిపై ప్రభావం పడింది. బోరు మోటార్లు పని చేయడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వాటర్ ట్యాంక్‌లో ఉన్న కొద్దిపాటి నీటినే వాడుకోవాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు.

నేలకొరిగిన వరి పంట..

తాండూరు మండలంలోని అంతారం, చెంగోల్, గౌతపూర్, ఎల్మకన్నె తోపాటు పెద్దేముల్ మండలంలోని మారెపల్లి తండా, దుగ్గాపూర్, మంచ్‌పల్లి గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షానికి వరిపంట నెలకొరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఈదురు గాలులతో కూలిన ఇల్లు..

ఈదురు గాలులతో కూడిన వర్షానికి పలు గ్రామాల్లో ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అంతారం గ్రామ సమీపంలోని ఎన్‌టీఆర్ కాలనీలో ఉంటున్న దప్పు రాజు ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి. వర్షానికి ఇంట్లోని సామగ్రి పూర్తిగా దెబ్బతింది. చంద్రవంచ గ్రామానికి చెందిన ఎండీ రఫాత్ నూతనంగా ఇల్లు నిర్మించుకుంటోంది. వర్షానికి బేస్‌మెంట్ దెబ్బతింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతోంది.

నవాబుపేట మండలంలో..

నవాబుపేట: గాలివానకు మండలంలోని మమ్మదన్‌పల్లి - కొత్తగడి గ్రామాల మధ్య, వికారాబాద్ -సదాశివాపేట ప్రధాన రోడ్డుపై చెట్లు వనిగి పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న నవాబుపేట ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుపై పడిన చెట్లను జేసీబీ సాయంతో తొలగించారు.

ఈదురు గాలులు.. పడిపోయిన చెట్లు

అనంతగిరి: వికారాబాద్‌లో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులు వీచాయి. కొత్తగడి మార్గంలో చెట్టు విరిగి ట్రాక్టర్‌పై పడటంతో శేఖర్‌రెడ్డి, వాజిద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. క్షతగాత్రులను వికారాబాద్‌లోని ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్‌ను ఆస్పత్రికి పంపారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్‌ను కోరారు. ఆస్పత్రికి వెళ్లిన వారిలో కొత్తగడి మాజీ కౌన్సిలర్ వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు చింటు తదితరులు ఉన్నారు.



అనంతగిరి: ఈదురు గాలులకు రోడ్డుపై పడిన చెట్టు



నవాబుపేట: రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

శిరీషకు మెరుగైన వైద్యం చేయించాలి

- పాఠశాల యాజమాన్యం చేతులెత్తేసింది : తల్లి అనురాధ
- వాపులున్నాయి, ఆరోగ్యం బాగుంది : ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి



గాయాన్ని చూపుతున్న తల్లి అనురాధ

ధారూరు: మున్నూరుసోమారం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల తరగతి గదిలో బుధవారం టీచర్ కుర్చి దగ్గర నిలబడ్డ శిరీష(6) అనే బాలికపై స్లాబ్ పైకప్పు పెచ్చులు ఊడిపడటంతో తీవ్ర గాయాలకు గురైన సంఘటన తెలిసిందే. బాలికకు వైద్యం చేయించడంలో పాఠశాల అధ్యాపకవర్గం నిర్లక్ష్యం చేశారు. రోజువారి కూలీ పనులతో కుటుంబాన్ని నెట్టుకొచ్చే తల్లిదండ్రులకు ఆర్థిక స్థోమత లేక మెరుగైన వైద్యం చేయించలేక అవస్థలు పడుతున్నారు. శుక్రవారం శిరీష తలకు తగిలిన గాయం తగ్గకపోగా తల ఉబ్బడం, చేతులు, కాళ్లకు వాపు రావడంపై వారంతా ఆందోళనకు గురవుతున్నారు. రోజురోజుకు శిరీష ఆరోగ్యం క్షీణించడంపై కుటుంబీకులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి చికిత్స చేయించాలని వారు కోరుతున్నారు.

మెరుగైన వైద్యం చేయిస్తా

విద్యార్థిని శిరీషకు మెరుగైన వైద్యం చేయించేందుకు మాజీ ఎంపీటీసీ రవీందర్ శుక్రవారం ముందుకు వచ్చారు. శిరీష ఆరోగ్యం కుదుటపడేంతవరకు చికిత్స అందించేందుకు సహకరిస్తా.

– రవీందర్, మాజీ ఎంపీటీసీ

బాగానే ఉంది

శిరీష ఆరోగ్యం బాగానే ఉంది. ప్రభుత్వ పరంగా వైద్యం చేయించేందుకు ఉండదు. ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటే ఖర్చు భరించే అవకాశం ఉంటుంది. కాలు, చెవి, చేతి దగ్గర గాయాలు తగ్గాలంటే కొన్ని రోజులు పడుతుంది. గాయాలు ఉబ్బడం చూసాను. పాఠశాల ఉపాధ్యాయుడు మొదటి రోజు చికిత్స చేయించారు.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ

పంట మార్పిడి విధానం మేలు

కందవాడలో కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ విద్యార్థుల పర్యటన



కందవాడలో రైతులతో మాట్లాడుతున్న విద్యార్థులు

చేవెళ్ల: రైతులు వ్యవసాయంలో పంట మార్పిడి విధానాలను పాటిస్తే అధిక దిగుబడులతో పాటు లాభాలు పొందవచ్చని మోజర్ల కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు పేర్కొన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని కందవాడలో శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటలో భాగంగా పంటలను వారు పరిశీలించారు. రైతులు సాగు చేస్తున్న పొలాలు పరిశీలించి అవలంబించే పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని రైతులతో సమావేశమై సాగుపై పలు సలహాలు, సూచనలు అందజేశారు. వ్యవసాయ రంగంలో నూతనంగా వస్తున్న విధానాల గురించి వివరించారు. ఒకే రకం పంటల సాగు చేయటంతో పంటల దిగుబడులు తగ్గటంతో పాటు చీడపీడల ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. పంట మార్పిడిలతో రైతులకు మేలు జరుగుతుందని సూచించారు. క్షేత్రస్థాయిలో రైతుల పద్ధతులను తెలుసుకునేందుకు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు స్వాతి, ప్రీతి, అఖిల, లావణ్య, గ్రామ రైతులు తదితరులు ఉన్నారు.

ఉమ్మడి ఆవిష్కరణలకు ఒప్పందం



డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి సమక్షంలో ఎంఓయూ చేసుకుంటున్న ఇరు సంస్థలు

శంకర్‌పల్లి: భారతదేశ భద్రత, నైపుణ్య అభివృద్ధి పెంపొందించేందుకు ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయం, బిట్స్ పిలానీ సంస్థలు కలిసి ఉమ్మడిగా ఆవిష్కరణలు చేసేందుకుగాను ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు ఇక్ఫాయ్ వైస్ చాన్స్‌లర్ ఎల్ఎస్ గణేశ్, బిట్స్ పిలానీ వైస్ చాన్స్‌లర్ రాంగోపాల్ రావు ఎంఓయూపై సంతకాలు చేసి, ఫైళ్లు మార్చుకున్నారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులలో నైపుణ్యాలను వెలికితీసేందుకు గాను సంస్థలు చేస్తున్న కృషిని కొనియాడారు. అనంతరం ఇరు సంస్థల వైస్ చాన్స్‌లర్లు మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ద్వారా ఇరు సంస్థల్లోని విద్యార్థులు ఉమ్మడిగా ఆవిష్కరణలు చేయవచ్చని స్పష్టం చేశారు. దీంతో సమయంతో పాటు, కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిట్స్ పిలానీ ప్రొఫెసర్లు సౌమ్యో ముఖర్జీ, సీఆర్ఈఎఎస్ అధిపతి ప్రొ.రాంమనోహర్‌బాబు, ఇక్ఫాయ్ రిజిస్ట్రార్ విజయలక్ష్మి, ప్రొఫెసర్లు సీఎస్ శైలజన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల శాంతియుత నిరసన



ప్లకార్డులు చేతబూని నిరసన వ్యక్తం చేస్తున్న అప్పాయిపల్లి రైతులు

- పరిహారం ఇవ్వాల్సిందే
- సర్వే నంబర్ 19లో భూములు కలిగిన రైతుల డిమాండ్
- ఎస్ఐ జోక్యంతో ధర్నా విరమణ

కొడంగల్: మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో సర్వే నంబర్ 19లో మెడికల్ కాలేజీ నిర్మాణం చేపటే స్థలం వద్ద రైతులు శుక్రవారం శాంతియుత నిరసన చేపట్టారు. అక్కడ కాలేజీ నిర్మాణానికి భూమిని చదును చేస్తుండగా అక్కడికి చేరుకుని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సర్వే నంబర్ 19లో భూములు కలిగిన రైతులకు సరైన పరిహారం అందలేదని, జాతీయ రహదారి పక్కనే ఉన్న భూములకు రూ.10 లక్షల పరిహారం సబబు కాదన్నారు. అసలైన లబ్ధిదారులకు పరిహారం అందలేదన్నారు. దీనిపై ఉన్నత అధికారులతో విచారణ చేపట్టి న్యాయం చేయలని డిమాండ్ చేశారు. కొడంగల్ ఎస్ఐ సత్యనారాయణ నిరసనకారుల వద్దకు చేరుకుని మాట్లాడారు. మీకు న్యాయం చేసే విధంగా ప్రయత్నిస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు బుగ్గమ్మ, పకీరప్ప, అమృతమ్మ, కిష్టయ్య గౌడ్, సావిత్రమ్మ, నారాయణ సింగ్, బాలప్ప, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అత్తతో గొడవపడి వెళ్లిపోయిన కోడలు



స్పందన (ఫైల్)

కేశంపేట: ఇంట్లో అత్తతో గొడవ పడిన కోడలు ఎటో వెళ్లిపోయిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సంగెం గ్రామానికి చెందిన కూడళ్ల బాలమణికి నలుగురు సంతానం. అందులో రెండో కూతురు స్పందనను ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన బట్టు సురేష్‌కు ఇచ్చి పదేళ్ల క్రితం వివాహం జరిపించారు. భార్యాభర్తలు వేములనర్వ గ్రామంలో ఆర్ఎంపీ వైద్యులుగా పనిచేస్తున్నారు. గురువారం సాయంత్రం అత్తాకోడళ్లు గొడవ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన స్పందన ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ కోసం భర్త సురేష్ వెతకగా లభ్యం కాలేదు. దీంతో స్పందన తల్లి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

షాద్‌నగర్: అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణ సమీపంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏఎస్ఐ అనంతరాములు కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్‌నగర్ సమీపంలో వాగు వద్ద గుర్తు తెలియని వ్యక్తి(40) అనుమానాస్పదంగా మృతి చెంది పడి ఉన్నాడు. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. శరీరంపై వసుపు రంగు టీషర్టు, నలుపు రంగు షార్ట్(నెక్కర్) ధరించి ఉన్నాడు. మృతి చెందిన వ్యక్తి రోడ్లపై తిరుగుతూ భిక్షాటన చేసే వ్యక్తి కావచ్చని, మల విసర్జన కోసం వాగువైపు వచ్చి కింద పడి రెండు రోజులు క్రితం మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసినా, ఆచూకీ లభించినా వెంటనే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మహ్మద్‌గౌస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మైనార్టీల అణచివేతకు కుట్ర

- మసీద్ కమిటీల అధ్యక్షులు
- వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఆమనగల్లులో భారీ ర్యాలీ

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ముస్లింలు భారీ ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు.బీజేపీ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మసీద్‌లో నమాజ్ అనంతరం వందలాది ముస్లింలు పెద్ద ఎత్తున్న చేరుకొని శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారితో పాటు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లబ్యాడ్జీలు ధరించి, జాతీయ జెండాతో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగం ముస్లింలకు ఇచ్చిన హక్కులు, మత స్వేచ్ఛను హరించడానికి బీజేపీ వక్ఫ్ సవరణ బిల్లు తీసుకు వచ్చిందని మైనార్టీ నాయకులు ఆరోపించారు. ఇది మైనార్టీలను అణచివేసే కుట్రలో భాగమేనని పేర్కొన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని ఆవేదన వెలిబుచ్చారు. వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేయడానికే కేంద్రం ఈ బిల్లును తీసుకువచ్చిందని దుయ్యబట్టారు. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది ముస్లింలు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో మసీద్ కమిటీల అధ్యక్షులు మహ్మద్ మసూమ్, గౌస్, మొనోద్దీన్, జానీభాయ్, సయ్యద్, సయ్యద్ మీర్, నాయకులు నయీం, జహంగీర్, జబ్బార్, జహంగీర్‌అలీ, జహంగీర్‌బాబా, మసూద్, రజాక్, అల్తాఫ్, ఎజాస్, ఖాదర్, హైమత్, జావీద్, అఫ్జల్, అహ్మద్, ముజిబూర్ రెహ్మాన్, అక్రమ్, జహంగీర్, సోహెబ్, అన్వర్, బాబా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆస్పత్రిలో క్యాథ్‌ల్యాబ్ సేవలు

- 12 పడకలతో అత్యవసర కేర్ యూనిట్
- ప్రారంభించిన టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్

సాక్షి, సిటీబ్యూరో: హృద్రోగ బాధితుల కోసం తార్నాక ఆర్టీసీ ఆస్పత్రిలో క్యాథ్‌ల్యాబ్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. 12 పడకల సామర్థ్యంతో అత్యవసర కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సర్వీసులను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ శుక్రవారం ప్రారంభించారు. ఫ్యాక్ట్స్ ఫౌండేషన్ క్యాథ్‌ల్యాబ్‌కు ఆర్థిక సహకారం అందజేయగా, క్రిటికల్ కేర్ యూనిట్‌కు అశోక్ లేలాండ్ సంస్థ సహకరించింది. అత్యవసర విభాగానికి నిర్మాణ్ డాట్ ఓఆర్‌జీ సంస్థ ఆర్థిక తోడ్పాటును అందజేసింది. ఈ సందర్భంగా ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ..ఆర్టీసీకి ప్రధాన వనరులైన ఉద్యోగులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంస్థ పనితీరు బాగుంటుందన్నారు. ఆస్పత్రిని భవిష్యత్తులో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తార్నాక ఆస్పత్రిలో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు అందుతున్నాయని, 2021లో రోజు సగటు ఓపీ 600 ఉండగా, ప్రస్తుతం రెండు వేలకు చేరిందన్నారు. ఎంఆర్ఐ, సీటీస్కాన్‌తో పాటు ఎమర్జెన్సీ వార్డు 24 గంటల ఫార్మసీ, ఫిజియో థెరపీ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, మునిశేఖర్, వెంకన్న, ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ శైలజామూర్తి తదితరులు పాల్గొన్నారు.

గోతుల దారి.. విమానం చేజారి

తరచూ దెబ్బతింటున్న ఎర్రకుంట రహదారి

- స్తంభించిపోతున్న ట్రాఫిక్
- సకాలంలో విమానాశ్రయానికి చేరుకోలేకపోతున్న ప్రయాణికులు



బారా మల్గీస్ వద్ద గోతులమయంగా మారిన రహదారి

పహాడీషరీఫ్: అది హైదరాబాద్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే ప్రధాన రహదారి.. మరోవైపు శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే రూట్ కావడంతో ఈ రహదారిలో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంత ప్రధానమైన రోడ్డుపై జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ పడితే అక్కడ గోతులు పడ్డాయి. దీంతో వాహనదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. తరచూ స్తంభిస్తున్న ట్రాఫిక్‌తో విమానాశ్రయానికి వెళ్లే వాహనదారులు విమానాలను అందుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంబులెన్స్‌లు సైతం ఈ ట్రాఫిక్‌లో చిక్కుకుంటుండడంతో రోగుల బంధువులు ఆర్తనాదాలు పెట్టుకోవాల్సి వస్తుంది.

ప్రమాదాలు జరిగినా స్పందన కరువు

ఎర్రకుంట బారా మల్గీస్ నుంచి మర్రి చెట్టు వరకు రోడ్డు తరచూ పాడవుతుండడంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. రెండేళ్ల క్రితం ఎర్రకుంట చౌరస్తాలో రోడ్డుపై మురుగు నీరు పారి గోతులమయంగా మారింది. ఈ గుంతలో కొందరు నిర్మాణ వ్యర్థాలు పోయడంతో రోడ్డు ఎగుడు దిగుడుగా మారి పెద్ద ఎత్తున ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దాదాపు ఐదారుగురు వ్యక్తులు ప్రమాదాలకు గురై మృత్యువాత పడాల్సి వచ్చింది. చివరకు మున్సిపాలిటీ తరఫున రూ.6 లక్షలు వెచ్చించి ఆ రోడ్డుకు మరమ్మతులు చేయడంతో కొన్నాళ్ల పాటు వాహనదారులకు ఉపశమనం కలిగింది. మళ్లీ తాజాగా ఎర్రకుంట పెట్రోల్ పంప్ ప్రాంతంలో ఎగువ బస్తీల మురుగునీరు రోడ్డుపై పారడంతో రోడ్డు గుంతలమయంగా మారింది.

మురుగు నీరు పారడంతో..

శ్రీశైలం జాతీయ రహదారిపై ఉన్న తుక్కుగూడ, కందుకూర్, కడ్తాల్ లాంటి పట్టణాలలో విశాలమైన రహదారితో పాటు రోడ్డు మధ్యలో డివైడర్, వర్షం వచ్చిన సమయంలో నీరు సాఫీగా వెళ్లేలా ఇరువైపులా కచ్చామోరీలను నిర్మించారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని ఈ రహదారిపై మాత్రం పరి స్థితి భిన్నంగా ఉంది. చాంద్రాయణగుట్ట సరిహద్దు దాటిన అనంతరం ఎర్రకుంట నుంచి మొదలుకొని పహాడీషరీఫ్ వరకు రహదారికి ఇరువైపులా కచ్చామోరీలు లేవు. కేవలం యూటర్న్‌లు మినహాయిస్తే పాదచారులు కూడా మధ్యలో రోడ్డు దాటకుండా ఇనుప కంచెలను నిర్మించ లేదు. సెంట్రల్ లైటింగ్ సిస్టం కూడా అసంపూర్తిగానే ఉంది. షాహిన్‌నగర్ హైవే హోటల్ పరిసరాలలో మురుగునీరు ఏడాది పొడవునా రోడ్డుపైనే పారడం అలవాటుగా మారిపోయింది. రోడ్లపై మరమ్మతులు కూడా చేయకుండా అటు ఆర్‌అండ్‌బీ అధికారులు పెట్టిన నిబంధనలతో స్థానిక మున్సిపాలిటీ అధికారులు వెనుకంజ వేస్తున్నారు.

రోడ్డుపై అడ్డంకులు ఉండొద్దు



ఎర్రకుంట నుంచి పహాడీషరీఫ్ వరకు రహదారిపై అడ్డంకులు లేకుండా ఆర్ అండ్‌బీ, మున్సిపల్ అధికారులు సమన్వయం చేసుకోవాలి. ఈ రోడ్డు దుస్థితి చూసి చాలా మంది ప్రత్యామ్నాయంగా ఆర్సీఐ, బాలాపూర్ రూట్‌లో వెళుతున్నారు. ఎర్రకుంటలో కిలోమీటర్ మేర డివైడర్ లేకపోవడంతో స్థానిక వాహనదారులు ఎక్కడ పడితే అక్కడ వాహనాల మధ్యలో యూటర్న్‌లు తీసుకుంటూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

– సయ్యద్ ఫెరోజ్, షాహిన్‌నగర్